

కీర్తనలు

భక్తి,జ్ఞాన భజనలు,పాటలు

భగవన్నామ సంకీర్తనలు




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020120034206

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓమ్

విజ్ఞప్తి

గుంటూరుజిల్లా గుంటూరు తాలూకా ఉప్పలపాడు గ్రామములో కీ. శే. పెద్ది వీరయ్యగారి కుమారుడు పెద్ది శేషయ్యగారి జ్ఞాపకార్థముగా, వీరి ధర్మపత్ని శ్రీమతి పెద్ది పుల్లమ్మగారిచే నిర్మింపబడిన ప్రాథమిక పాఠశాల, తదంగ భూతమగు ప్రార్థనామందిరము, ఉప్పలపాడు గ్రామస్థుల ఉపయోగార్థము నిర్మింపబడినది. ఆ ప్రార్థనామందిరమున అనుదినము జరుగు దైవసంకీర్తనము లనేకులు వ్రాసికొని పఠించుటలో శ్రమ కలుగుచున్నందువల్ల శ్రీమతి పుల్లమ్మగారి తండ్రిగారైన పాలడుగు వెంకయ్యగారి ప్రోత్సాహముతోడను గ్రామస్థుల సహాయముచేతను భగవన్నామ సంకీర్తనములు అను పేరుతో వాటినన్నిటి జేర్చి పుస్తకరూపమున ప్రకటించడ మైనది.

ప్రార్థనామందిరము
ఉప్పలపాడు (పోస్టు)
గుంటూరు తా.

ఇట్లు ప్రకాశకులు
శ్రీ మహర్షి మళయాలస్వాములవారిపాదధూళి
భజనబాబు

భగవన్నామసంకీర్తనలు

—♦ శ్రీ సద్గురుధ్యానమ్. ♦—

ఓం బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యమ్
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి. 1

చైతన్యం పరిపూర్ణమేకమచలం జ్యోతిర్మయం వ్యాపకం
తత్త్వంచాక్షర మంత్రమగ్ర్యమమలంసూక్ష్మాతిసూక్ష్మం పదమ్
లింగం బ్రహ్మ సనాతనం సుమనసాం ధ్యాతవ్యమానం సదా
బాహ్యాభ్యంతరసంస్థితం పరశివం ప్రాణేశ్వరం భావయే. 2

గమాగమస్థం గమనాది వర్జితం
చిద్రూపదీపం తిమిరాంధనాశనమ్
పశ్యామి తం సర్వజనాంతరస్థం
నమామి హంసం పరమాత్మ రూపమ్. 3

—✻ దైవ ప్రార్థన ✻—

కరుణామూర్తియగు సర్వేశ్వరా! మాచిత్తము సర్వకాల సర్వావస్థలయందును నీపాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము!

పరమదయానిధీ! ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువఱకును మనోవాక్కాయములచే మావలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర

ప్రాణికోట్లకు ఉపకారముచేయులాగునను సద్బుద్ధిని దయ చేయుము !

సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా! మా యంతః కరణమునందు ఎన్నడును ఏవిధమైన దుష్టసంకల్పముగాని, విషయవాసనగాని, అజ్ఞానవృత్తిగాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము!

వేదాంతవేద్యా! అభయస్వరూపా! మాయందు భక్తి, జ్ఞాన, వైరాగ్యబీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధములగు నట్లు ఆశీర్వదింపుము! మఱియు ఈజన్మమునందే కడతేరి నీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తిసామర్థ్యములను కరుణతో నొసంగుము!

దేవా! నీవు భక్తవత్సలుడవు! దీనులపాలిటి కల్ప వృక్షమవు! నీవు తప్ప నాకింకెవరు దిక్కు? నిన్ను ఆశ్ర యించితిని. అసత్తునుండి సత్తునకు గొనిపొమ్ము! తమస్సునుండి జ్యోతిలోనికి తీసికొనిపొమ్ము! మృత్యువునుండి అమృతత్వ మును పొందింపజేయుము. ఇదే మావినతి. అనుగ్రహింపుము. నీదరి జేర్చుకొనుము! పాహిమాం, పాహిమాం, పాహిమాం, పాహి!! ఓం తత్ సత్.

[ఈ ప్రార్థనను ఎవరు ప్రతిదినము నియమము తప్పక ఉదయము నిద్రలేచునపుడును, రాత్రి పరుండబోవునపుడును మనస్ఫూర్తిగ పఠించుదురో, అట్టివారికి జీవితమునం దేలాటి దోషములున్ను కలుగకుండుటయేగాక సర్వే శ్వరునియొక్క అనుగ్రహమునకున్ను వారు పాత్రులు కాగలరు.]

—• సామూహిక భగవత్ప్రార్థన •—

౧. ఓమ్ ఓమ్ ఓమ్

౨. (1) ఓం నమః శివాయ (6 సారులు)

(2) ఓం నమో నారాయణాయ (6 సారులు)

(3) ఓం నమో భగవతే వాసుదేవాయ (6 సారులు)

(4) శ్రీరామ జయరామ జయజయరామ (6 సారులు)

3. హరే రామ హరే రామ రామ రామ హరే హరే!
హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే।
(6 సారులు)

—* శ్రీ భగవన్నామ సంకీర్తనమ్. *—

శ్రీ గణనాయక నమో నమో–సిద్ధివినాయక నమో నమో
నాగవిభూషణ నమో నమో–నవ్యసుభాషణ నమో నమో
పార్వతీనందన నమో నమో–పాపనికృంతన నమో నమో
సర్వజనస్తుత నమో నమో–సర్వశుభప్రద నమో నమో. 1

శ్రీకృష్ణానంద ముకుంద మురారే వామన మాధవ గోవింద
శ్రీధర కేశవ రాఘవ విష్ణో లక్ష్మీనాయక నరసింహ. 2

గోవింద గోవింద హరే మురారే
గోవింద గోవింద రథాంగపాణే
గోవింద గోవింద ముకుంద కృష్ణ
గోవింద గోవింద నమో నమస్తే. 3

నమామి నారాయణ పాదపంకజం
కరోమి నారాయణ పూజనం సదా
వదామి నారాయణ నామ నిర్మలం
స్మరామి నారాయణ తత్త్వమవ్యయమ్. 4

చింతయామి హరిమేవ సంతతం
మందమంద హసితాననాంబుజమ్
నందగోప తనయం పరాత్పరం
నారదాది మునిబృంద వందితమ్. 5

శ్రీకృష్ణ గోవింద హరే మురారే
హేనాథ నారాయణ వాసుదేవ. 6

రామ రామ రామ రామ రామనామతారకం
రామ కృష్ణ వాసుదేవ భక్తిముక్తి దాయకమ్॥
జానకీమనోహరం సకలలోకనాయకం
శంకరాది సేవ్యమాన దివ్యనామ కీర్తనమ్. 7

శ్రీకృష్ణ చైతన్య ప్రభు నిత్యానంద
హరే రామ హరే కృష్ణ రాధే గోవింద. 8

నామస్మరణా ధన్యోపాయం-నహి పశ్యామో భవతరణే
రామ హరే కృష్ణ హరే-తవ నామ వదామి సదా నృహరే.

చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర పాహిమామ్
చంద్రశేఖర చంద్రశేఖర చంద్రశేఖర రక్ష మామ్. 10

శంభో శంకర గౌరీనాథ సాంబసదాశివ సర్వేశ
చంద్రచూడ గంగాధర పురహర సర్పవిభూష శ్రీగిరీశ. 11

రఘుపతి రాఘవ రాజారామ్ పతితపావన సీతారామ్
ఈశ్వర అల్లా తేరేనామ్ సబ్ కో సమ్మతి దే భగవాన్.
సుందర మాధవ మేఘశ్యామ్ గంగా తులసీ సాలగ్రామ్
చండకిరణ కులమండన రామ్ శుద్ధ బ్రహ్మ పరాత్పర రామ్
భద్రగిరీశా సీతారాం భక్తవత్సలా సీతారాం. 12

13. కీర్తన.

1. పరోపకారీ భక్తుండెవడో వాడే నిజగము వైష్ణవుడూ
   మేలుంజేసియు నేజేసితినని మిగులుగ బల్కని వాడెవడో॥
2. సర్వప్రపంచపు మానవకోటికి సాష్టాంగముగా దండమిడి
   నిందలజేయక తను మనుభాషల నిశ్చలుడైనావాడెవడో॥ప
3. సర్వజీవముల నెల్లవేళల తనసమానముగ మదిలో నెంచి
   పరధన పరస్త్రీ దూరత సత్యము వెరువక బల్కెడు
   వాడెవడో ॥ప॥
4. మాయల జేయక మోహమునొందక మదిలో వైరాగ్యము
   బూనీ। రాముని నామము చెవి బడినంతనె రంజిలుమది
   గలవాడెవడో ॥ప॥
5. కామ క్రోధ లోభ మాదిగాగల శత్రువులను బరిమార్చి
   ఘనుడౌ భక్తుడె పూజ్యుడు వానిని గన్న తరింతురు యీ
   ధరణిన్ ॥ప
6. గాంధిమహాత్ముడు జైలున కేగుచు గానము జేసిన గేయ
   మిది। గాంధిమహాత్ముని శిష్యులపాలిటి కల్పవృక్షమై
   తనరు నిదీ ॥ప॥

14. కేదారగౌళరాగము — చాపుతాళము.

ప. నేడు మనమందరము గూడి-పాడుదము పరమేశుని
గొనియాడుదము పరమేశుని ॥నేడు॥

అ. ఈడు జగముల లేక యంతట
హెచ్చు వెలిగెడి జ్యోతిని ॥నేడు॥

చ. కందరంబుల మందిరంబుల గహనపర్వతసీమల
సుందరధ్వనితోడ యోగులు స్తుతులొనర్చెడి దేవుని॥ నేడు

2, చెట్టు చెట్టున కాననంబుల జెలగి మధురరుతంబుల
పిట్ట లెవనిని పాడుచుండునో ప్రీతిసాగరు నాతని ॥నేడు॥

3. నూతులందున చెఱువులందున లోతు తెలియని వార్ధిలో
శీతజలములఁ గ్రోలి కీర్తనచేయు జలచర మాతని ॥నేడు॥

4. ఉత్సవంబుల నుల్లమలరఁగ నువిద లెవ్వని పాడుచు
ఉత్సహింతురోయా దయామయును త్తమోత్తమపురుషుని॥

5. శూరులును వీరాధివీరులు శుద్ధహృదయాంబుజముల
సారెసారెకు నెవనిదలతురో సత్స్వరూపు పరేశుని ॥నేడు॥

15. బేహాగ్ రాగము_ఆదితాళము.

ప. మఱి రాదుగ యీ మానవజన్మము॥

అ॥ పరమ పురుషు కృప-వలనని కలిగెను॥ మఱి॥

చ. పరమేశునివౌ-పరమాద్భుతముల
దరిశన మొనరింప-దగు యంత్రం బిది॥ మఱి॥

16. కీర్తన - ఆదితాళము.

ప. సాక్షియె సద్గురుడూ-నీలో సాక్షిని గనరయ్యా॥

1. ఎంత చదివినా ఎంత నేర్చినా సుంతసాక్షి కరుణా లేనిదే అంతయునూ సున్నా॥ సాక్షి॥

2. తప్పులు సేయకుడీ చేసినశిక్షించును సాక్షి-సాక్షిమాత్రుండై సర్వేశ్వరుడు సకలమునందు వసించు నట్టియా - సాక్షియె సద్గురుడూ మీలో సాక్షిని గనరయ్యా॥ సాక్షి॥

3 సాక్షియె బ్రహ్మ, సాక్షియె విష్ణువు, సాక్షియె దేవుం డీశ్వరుండును సాక్షియె సాక్షాత్ పరబ్రహ్మము ॥ సాక్షి ॥

4 వ్యాసాశ్రమమున, భజనబాబుఇట సద్గురుమూర్తిని గొలిచి నట్టి యా, సాక్షియే సద్గురుడూ మీలో సాక్షిని గన రయ్యా॥ సాక్షి ॥

16. శంకరాభరణము - ఆది.

కలికల్మషనాశనమంత్రం । శ్రీరామనామమంత్రం.

1. కలికి భీకుమను । కామక్రోధముల । కాలచక్రమునజిక్కి । క్రుక్కి కష్టమందనేల ॥మానవ॥ కష్టమందనేలా॥ నారదాది మహామునీంద్రులు నమ్మి తరించిన రామనామం ॥కలికల్మష॥

2. మానసమున మహిలోనికలిమి బహుభోగములను శాశ్వతమనితలచి మహిత నరకముల పడనేలా॥నరుడా॥ మహిత నరకముల బడనేలా. ధ్యానగమ్యు పదధ్యానమొనర్చి ధన్యత నొందగలేవా ॥నరుడా॥ కలి॥

3. వలచిన దలచిన గొలచిన భవభయము బాపి దగ ధన్యత గూర్చును ॥కలికల్మష॥

4. అక్షయమని మలయాళీమహర్షి యొసగిచ్చిన మహామంత్రంబిదే సాక్షిసాధు శ్రీభజనబాబు సతతము స్మరణము జేసెడి మంత్రం ॥కలికల్మష॥

18. మోహన - చతు - ఆది

కృష్ణ కృష్ణ కృష్ణా యను మనసా అన్యచింత నీకేందుకే మనసా ॥కృష్ణ॥

(1) హెచ్చుగ ద్రవ్యము మోసకృత్యముగ నెంత కూడబెట్టిన నెపుడైననువచ్చు మృత్యు వేకృతముగనైనను వలదన బోవదు వారింపగనెటు ॥కృ॥

(2) తుచ్ఛ సుఖంబుల కాశించియు నీయిచ్ఛవచ్చినటు తిరుగకే మనసా అచ్చముగ దూరము నాలోచింపగ నస్వతంత్రపుం బ్రతుకిది మనసా ॥కృ॥

(3) నిరతము కృష్ణుని స్మరియించిన మది నీకు యమునిబాధలెపుడు గలుగవు నిరంతరము సత్యమువచించుమా నీ కష్టార్జితమే భుజించుమా పరులనెపుడు దూషణ సేయకుమా పాటుబడుమా దేవదేవు కృపకై ॥కృ॥

(4) వినయముంచుమా పెద్దల పొడగని విశ్వామిత్రుని కథలాకర్ణించుమా నినుగని కాలుడు ఘనముగ బెదరును నీ నీతికి హరి సంతోషించును ॥కృ॥

5. భక్తుల వచనాళే తిరుమంత్రంబుగ బాలించుమా శ్రీ సాధు
వచనముల బాగుగానమ్మి సాధువచనముల భజనబాబు
వచనంబులే స్థిరముగ ॥కృ॥

రమంతే యోగినః అస్మిన్నితివ్యుత్పత్తిచే యోగులు హృదయకోశమందు క్రీడించునట్టి ఆనందస్వరూపము. అట్టి రామనామ మవిద్యతత్కార్యభూతమగు సంసారమును నివర్తింపజేయును.

రామనామమే తానగుటకు సాధనములు పెక్కులు గలవు. వానిలో నిష్కామకర్మ వైరాగ్యములు ప్రధానములు. పనిచేయుము. ఫలితమును గోరకుము. అప్పుడు భగవంతుడు ఋణపడును. ప్రతిభూతమందు ఆత్మబుద్ధితో మెలగుము. ఏ జీవికి నపకారము జేయకుము. కామాదిదోషదూషితుడవు గాకుము. సదా బ్రహ్మచింతనము జేయుము. ఇతరులకు తత్త్వమునే బోధింపుము. లోకుల కొరకు సత్యమును మరుగు పరచకుము. ఆత్మసాక్షిగా పనిజేయుము సర్వాంతర్యామియగు చైతన్యమును సర్వవస్తువులందు జూడుము. అప్పుడు సర్వమానవ సౌహార్ద్రి మేర్పడును. జ్ఞానపూర్వకమగు భక్తిని నభ్యసింపుము. జ్ఞానమువలన అజ్ఞానమునశించి రామనామము యొక్క నిజస్వరూపము గోచరించును. అవిద్యానివృత్తి పూర్వకబ్రహ్మభావమే మోక్షము. పై సాధనాభ్యాసమువలన మోక్షము నందెదవు.

19. భగవన్నామమె మార్గమండి.

శ్రీరామ్ జయరామ్ జయజయరామ్ ఓమ్ - శ్రీరామ్ జయరామ్ జయజయరామ్ ఓం—

1. మహిమాన్వితమగు మానవజన్మము కలుగుట యిలలో దుర్లభము-దుర్లభమైనా మానవజన్మను, దుఃఖము లకు గురిచేయకుడీ-ఓం శ్రీరాం జయరాం జయజయరాం ...

2. పశుప్రవృత్తుల అజ్ఞానంబందున పడియుండుట ఏహ్యాం బండీ మానవత్వమును తరచిచూడవలె, మనకర్తవ్యంబది నుండీ-ఓం శ్రీరాం జయరాం జయజయరాం ఓం...

3. సర్వభూతముల హృన్నివాసుడగు శ్రీహరి మనలో కలడండీ-శ్రీహరి దాసులమగుట యెటులనో, మానవజీవిత గమ్యమండీ-ఓం శ్రీరాం జయరాం జయజయరాం ఓం...

4. సర్వమతంబులసారంబిదియని స్పష్టముగా మీరెరు గండి-అహంభావమును నిర్మూలించి, ఆత్మార్పణమును చేయండి- ఓం శ్రీరాం జయరాం జయజయరాం ఓం శ్రీరాం

5. భక్తిభావములో భగవత్పదముల బహుభంగుల సేవించుటయే-ఆత్మార్పణమున కంతరార్థమని ఆర్యులు తెల్పిన సూత్రమండి, ఓం శ్రీరాం జయరాం జయజయరాం ఓం శ్రీరాం ...

6. భగవదనుగ్రహ మున్నట్లైతే, భక్తిభావమూ కలుగు నండి, భగవదనుగ్రహపాత్రులమగుటకు భగవన్నామమె మార్గమండి ఓం శ్రీరాం జయరాం, జయజయరాం ఓం శ్రీరాం జయరాం జయ జయ రాం ఓం. ... .

20. కీర్తన - ఆదితాళం - శుద్ధబంగాళారాగం.

ప. రామభక్తి స అ ఆంబ్రా ఆజ్యం ౦౦౦
యేమానవులా కాబ్బెనో మనసా ॥రా॥

అ. ఆ మానవులా సందర్శన అ- అత్యంతా బ్రహ్మానంద
మే ఎ ఎ ఎ మనసా ॥రా॥

చ. యీలగని వివరించతేను చాలాస్వానుభవ-వే ఎ ఏ జ్యా
మేలీలాసృష్టి - జగాత్రయమున కోలాహల త్యాగరాజ
నుతుడా ॥రామభక్తి॥

21. కీర్తన

ప. నన్ను విడచి కదలకురా ॥రామయ్య రామా కోదండ
రామా ॥నన్ను॥

1. నిన్ను వినా పరులా సన్నుతింపనురా రామయ్యారామా॥

2. జానకీ రమణ నాజతబానీ చనబోకు మనసా కుసుమముల
మనసార పూజింతు ॥నన్ను॥

3. రాతి నాతిగజేసి గజరాజును దయజూచిన వైరితమ్ముని
గాచిన శరణాగతవన పాలనా ॥నన్ను॥

4. నీవే గతియనుచు నెరనమ్మితి సీతాపతీ నీవు నను విడనాడిన
గతిలేదు గద మరివేరే వినరా ॥నన్ను॥

22: కీర్తన

చాల్ చాల్ ఓమనసా సంసారం ఇక నీకు ॥చాల్॥

1. సారసాక్షు భజనజేసి సద్గతిని బొందరాద
కపటవృత్తి మానరాద క్రౌర్యమింక విడువరాద ॥చాల్॥

2. పుత్ర ధన వాంఛలందు మత్తుగాను తిరిగెదవు
సత్యవస్తు వెరుగవు అసత్యమునె నమ్మెదవు ॥చాల్॥

3. యాత్ర లెన్నో జేసితినని వెర్రివలె తిరిగెదవు
ఏకమైన త్రికూటయాత్ర నీవెరుగవాహా ॥చాల్

4. సాధుగోష్ఠిలోన జేరి సద్భక్తితోడ గూడి
స్కంధాపురీసునైన సారసాక్షు వెరుగవాహ ॥చాల్

23. సౌరాష్ట్రరాగం - ఆదితాళం

ప. శరణం భవకరుణామయి కురుదీనదయాళో
కరుణారస వరుణాలయ కరిరాజకృపాళో ॥శ

అ. అధునాఖిలు విధినామయి సుధియానురభరితం ॥శ
మధుసూదన మధుసూదన హరమామక దురితం ॥శ
వరనూపురధర సుందరకరశోభిత వలయ
సురభూసుర భయవారక ధరణీధర కృపయా
త్వరయా హర భయమీశ్వర సురవర్య మదీయం
మధుసూదన మధుసూదన హర మామక దురితం ॥శ॥
ఘృణిమండల మణికుండల ఫణికుండల శయన
అణిమాది సుగుణభూషణ మణిమంటప సదన
వినతానుత ఘనవాహన మునిమానస భవన
మధుసూదన మధుసూదన హర మామక దురితం ॥శ॥
అరిభీకర హలిసోదర పరిపూర్ణ సుఖాబ్జే
నరకాంతక నరపాలక పరిపాలిత జలధే
హరిసేవక శివనారాయణతీర్థ పరాత్మన్
మధుసూదన మధుసూదన హర మామక దురితం ॥శ॥

24. కీర్తన

1. కుండలి యోగము నెరిగినందు కాదండి యెరుకసాక్షి
బండప్రపంచము నిజానిజములకు భగవంతుడె సాక్షి ॥కుం॥
2. గురుభక్తుండై బరగినందులకు భ్రమలుడుగుటె సాక్షి
సరివైరాగ్యము సలిపినందులకు గురికుదురుటె సాక్షి ॥కుం॥

3. సతతము సాంఖ్యము యెరిగినయెడ మితహారమె సాక్షీ
అతినిర్మల సద్గతిగన్నందుకు వెతలుడుగుటె సాక్షీ ॥కుం॥
4. వేదరహస్యం బెరిగినందులకు క్రోధముడుగుటె సాక్షీ
పొందుగ బ్రహ్మజ్ఞానం బెరిగితె సాధులగుటె సాక్షీ ॥కుం॥
5. హంస నంటినందుకు విషయాదులు ధ్వంసమగుటె సాక్షీ
అవసర మంతయు దీరినంతనె సంశయముడుగుటె సాక్షీ॥
6. మదిలోపల మద్గురు పదములు మరువనిదె సాక్షీ
సతతంబును శ్రీరామ లక్ష్మీశ్వర సరళిగనుటె సాక్షీ ॥కుం॥

25. భూపాళ - ఆటతాళం

శ్రీమతే రామానుజాయను-నామమే శ్రీరామనామము
ప్రేమతో హరిదాసులకు-ప్రియమైన యీనామం ॥శ్రీరామ॥
1. ఆది మూలంబునకు మొద-లాధారమైనది రామనామము
సాధులకు సద్భక్తులకు-సద్బోధ యీనామం ॥శ్రీరామ॥
2 అండపిండాండములకును-బ్రహ్మాండమైనది రామనామము
నిండు షోడశకళలుగల-యఖండమీనామం ॥శ్రీరామ॥
3. బ్రహ్మ విష్ణు మహేశ్వరాదులు-సన్నుతించినరామనామము
యిమ్మహి జనులకును-మోక్షంబిచ్చు యీనామం॥
4. పార్వతికి యుపదేశమై-పంచాక్షరైనది రామనామము
సరస్వతికి చతురాక్షరైనది-ధ్యాన మీనామం ॥శ్రీరామ॥
5. స్నానసీమము దానముల-కాధారమైనది రామనామము
జ్ఞానులకు సన్యాసులకు-సంప్రీతి యీనామం ॥శ్రీరామ॥
6 నారదాది మహామునీంద్రులు-నమ్మికొలిచిన రామనామము
పరమపదమును బొందజేసెడి-పఠన మీనామం ॥శ్రీరామ

7. రామ నామము జేయువారికి-ఆపదెన్నడు లేదు నిత్యము
తొలుగు దోషము-బాయుపాపము పొందుపుణ్యములు॥
8. దాసులకు తద్దాసు రంగాదాసు నేలిన రామనామము
వాసిగా శ్రీనివాస రాఘవ-దేశికుని నామం॥ శ్రీరామ నామం

26. సామరాగం - ఆదితాళం.

శాంతములేకా సౌఖ్యములేదు సారసదళనయనా
దాంతునికైన వేదాంతునికైన ॥శాం
1. దారసుతులు ధనా ధాన్యము లుండిన
సారెకు జపతప సంపదగలిగినా ॥శాం
2. ఆగమ శాస్త్రము లన్నియు జదివిన
బాగుగ సకలహృద్భావము గలిగినా ॥శాం
3. యాగాది కర్మము లన్నియు జేసిన
భాగవతులాగుచు బాగుగ దెలిసినా ॥శాం
4 రాజాధిరాజ శ్రీరాఘవ త్యాగరాజ
వినుత సాధురక్షకునికైన ॥శాం

27. దర్బారు రాగం - ఆదితాళం

గురుసేవకన్న ఆర్జనమేమి యున్నదీ గుణవంతులకు భువిని
ధర జనామరణ దోషము బాపుటకు పెద్ద ధోర మెవ్వ
రయ్యా సద్గురుమూర్తికన్నాను ॥గురు
1. దారా పుత్రాది మోహంబనే తిమిరము దారి తెలియ
నివ్వదూ భూరికలుషములకూ మూలమైనయట్టి పాడు
కొంపను నమ్మకనూ గురుశేరవే ॥గురు

2. త్రివిధ కరణములచే స్థిరయావుడని సద్గురుని నమ్మగరాద
నవనవయౌవ్వనములు గలిగిన నారీమణుల నమ్మగనేల
భువి జెడనేలా ॥గురు

3. కాయము నమ్మిన కష్టమొందుటగాని హాయిలేదెన్నాటికి
మాయదెలిసినట్టి సుబ్బయాచార్యునిజేరి కాయాము
దొలగే వుపాయము గనవలెను ॥గురుసేవకన్న॥

28. కీర్తన

నను బ్రోవర శ్రీమన్నారాయణ వేగ నిను నెరనమ్మితి
నీలవర్ణ వేగ ॥నను

1. అనుదినమును నాకనులపంతువగాను గనుగొనుటెన్నడు
గరుడగమన హరి ॥నను

2. మదనజనక నాహృదయకమలమందు సదయుడవని నిన్ను
చాలనమ్మితి వేగ ॥నను

3. కంచి నగరమందు కరుణతో నెలకొన్న చంచలనిలయుడ
జాలమేలర వేగ ॥నను బ్రోవర

29. కాంభోజిరాగం - ఆదితాళం

శ్రీరామ జయరామ శృంగార రామయని చింతింపరాదె
ఓమనసా ॥శ్రీరామ

1. తళుకుచెక్కిలి ముద్దుబెట్ట కౌసల్య మును తపమేమిశేసెనో
తెలియా ॥శ్రీ

2. దశరథుడు శ్రీరామాయని పిలువా
తపమేమి శేసెనో తెలియా ॥శ్రీ

3. తనివార పరిచర్య జేయ సౌమిత్రి
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

4. తనవెంట జనజూచి వృష్టాంగ కౌసికుడు
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

5. శాపంబడగి రూపవతి యవుట అహల్య
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

6. ధర్మాత్మ శరణంబుసోక శివుచాపంబు
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

7. తన తనయ నొసగి కనులారగన జనకుండు
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

8. దహారంబు కరగ కరమునుబట్ట జానకి
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

9. త్యాగరాజాప్తయని పొగడ నారదమౌని
తపమేమి జేసెనో తెలియా ॥శ్రీ

30. శుద్ధసావేరి _ రూపకతాళం.

ప. కాలహరణ మేలరా హరే సీతారామ ॥కాల

అ. కాలహరణమేల సుగుణజాల కరుణాలవాల ॥కాల

1. చుట్టుచుట్టి పక్షులెల్ల చెట్టువెదకురీతి భువిని
పుట్టగానె నీపదములు పట్టుకొన్న నన్ను బ్రోవ ॥కాల

2. పుడమిని ఎంతాడు కొన్న భూమిని త్యాగంబురీతి
కడువెలసియున్న నీవుగాక ఎవరు నన్ను బ్రోవ ॥కాల

3. దినదినమును తిరిగి తిరిగి దిక్కులేక శరణుజొచ్చి
తనువు ధనము నీదేయంటి త్యాగరాజవినుత రామ ॥కాల

31. శంకరాభరణ రాగము.

ప. మనసు స్వాధీనమైన ఆఘనునకు
'మరి మంత్ర తంత్రము లేల||

అ. తనువు తానుగానని ఎంచు వానికి
తపసు చేయగనేలా దశరథబాల||

చ. అన్ని నీవనుచు ఎంచిన వానికి
ఆశ్రమ భేదములేల
కన్నుగట్టు మాయలని ఎంచువానికి
కాంతల భ్రమలేల దశరథబాల||

2. ఆజన్మము దుర్విషయ రహితునకు
గతాగతము లికయేల
రాజరాజేశ నిరంజన నిరుపమ
రాజవదన త్యాగరాజ వినుత||

32. ఆనందభైరవి రాగం.

నన్ను విడచి కదలకురా వదలకురా ||నన్ను

1. నిన్నెడబాసి అరనిముస మోర్వనురా
అరగడియ తాళనురా |నన్ను

2. ఒడలు దగిలియున్న వేళ గొప్పవడగండ్లు
గురిసినట్లాయె నీవేళ |నన్ను

3. అబ్ధిలో మునిగి శ్వాసమునుబట్టి ఆణి
ముత్యము గన్నట్లాయె శ్రీరమణా |నన్ను

4. తరముగాని ఎండవేళ కల్పతరునీడ
దొరకినట్లాయె నీవేళ |నన్ను

5. వసుధను ఖననము జేసి ధనభాండ
మబ్బినరీతి గనుగొంటిడాసి ।నన్ను

6. బాగుగ నన్నేలుకోరా అల్లత్యాగరాజ
నుత తనువు నీదేరా ।నన్ను

33. కీర్తన.

రఘురామనామ స్మరణామృతపానమే
కామిత ఫలదాయకమాగా ।రఘు

1. సంసార దుఃఖసాగరము తరింపగ నావికయై యలరారు
గదా-కామ క్రోధ లోభ మోహముల కాల్చి కాల్చి మసి
చేయు గదా ।రఘు

2. తనువు విడచి జీవాత్మ యరుగగా తలవాకిట బడవైతురుగా-
అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని అనుదినమును స్మరి
యింపు డికన్ ।రఘు

34. కీర్తన.

వదలకు మార్గము వరమార్గమ్మున వర్తిలుచుండవె యో
మనసా।
సదమలభక్తిని స్వామిని గొలుచుచు సౌఖ్యములొందవె
యోమనసా ॥వద

1. పరుల సుఖమునే పాటించుచు భువి
పనులొనరింపవె యోమనసా
దురిత దవాగ్నిని దూకుచు దారుణ
దుఃఖము లొందకె యోమనసా ।వద

2. సత్యమె సర్వశ్రేయస్కరమని
సతత మెరుంగవె యోమనసా

సత్యవ్రతమును సలిపెడు నప్పుడె
శౌర్యము జూపవె యోమనసా ।వద

3. న్యాయమె సర్వప్రాయము జగతిని
నమ్ముము దృఢముగ యోమనసా
న్యాయము దప్పిన నరకంబుగ భువి
నాడే మారుని యోమనసా ।వద

4 సుగుణరత్నములు సొగసుగ దాల్చి
శోభిలుచుండవె యోమనసా
అగణితగుణ రత్నాకరుడగు
పరమాత్మయె శరణము విను మనసా ।వద

35. కాంభోజరాగం _ ఆదితాళం.

ప. మాజానకి చెట్టబట్టగ మహారాజవైతివి ।మా

అ. రాజరాజవర! రాజీవాక్ష! విను రావణారియని రాజిల్లు
కీర్తియు ।మా

చ. కానరేగి యాజ్ఞమీరక మాయాకారము నిచిలికి చెంతనే
యుండి దానవుని వెంటనే చని యశోక తరుమూలనుండి,
వానిమాటలకు గోపగించి కంట వధియించక పోయే
యుండి శ్రీనాయక! యశము నీకే కల్గచేయలేద? త్యాగ
రాజ పరిపాల! ।మా

36. దర్బారురాగం _ అటతాళం.

దశరథ రాజకుమార నే నీవశమైయున్నాను చేకోర దశ
ముఖసంహార ధరణిజపతిరామ అసమానతేజ నిన్నాత్మలో
నిలిపియు అనుపమ భక్తిని వేడితిని యినుమంత నీదయ

యుంచు నాపై శశిధరానుత సేవితామర జేసెదను నీ సేవ నిరతము ||దశరథ

1 బాలప్రాయమున కొన్నాళ్లు యౌవ్వనకాలము గడిపి కొన్నాళ్లు యీలాగు కాలము యిలలోన గడిపియు నీల మేఘశ్యామ నిన్ను దెలియనైతిని |మి| చిలుకకును శ్రీరామ యని యా చెలియ వేశ్యయు జెప్పినంతనే లలన బ్రోచిన లక్ష్మీనాయక సలలితంబుగ నేలుమయ్యా |ద|

2. తల్లి దండ్రి తాతవని నాయుల్లములో నమ్మితిని కల్ల మాటలుగావు గారవింపుము తండ్రి ఫుల్లాబ్జలోచన పూర్ణేందువదన నీ యుల్లమున నను కల్లసేయక తల్లి తనయుని బెంచినటువలె నల్లనయ్యా నీకృప వెదజల్లు నాపై కొల్లలుగను |దశరథ|

3. నీపాదములె గతిమాకు మమ్ము యేలుకొను స్వామి పరాకు మాపాల గలిగిన శ్రీపతి యీప్రొద్దు కాపాడి రక్షించు కనకాంబరధర|| కరుణతోడుత నన్ను గావుము కమలములే నమ్మియుంటిని విమలమైన భక్తితోను వేడుచుంటిని నన్ను గావుము |దశరథ|

3. ముక్తిమార్గము దెలియలేను నేనీభక్తిని గూడియున్నాను. యుక్తజ్ఞానము నిచ్చి వచ్చి గారవించి ముక్తిదొరుకునట్టి సూక్తులు దెలుపరా|| భక్తవరద పరాకుసేయకు శక్తి లేకనె యున్నవాడను ముక్తిదాయక మోక్షమొసగుము మాధుకని మదిదలవకను శ్రీ |దశరథ

5. అంగలూరు పురనివాస సీతాంగన పతిభక్తపోషణ
అంగజ జనక విహంగరాట్తురంగ రంగవిపత్సరం
పరోత్తుంగ యో సంగరహిత మునీంద్రసన్నుత
భంగ భయభవభంగ శ్రీరఘుపుంగవా నను భంగపెట్టక
రంగుమీరగ బ్రోవుమయ్యా ॥దశరథ

6. నాగభూషణదాసు కృపను నిన్ను బాగుగ వేడితి ధరను
సాగరశయన యోసజ్జనసేవిత యోగిజనస్తోత్ర యోభక్త
మందార॥ తగవు సేయక మద్దిరామయదాసు మొరవిని
వేగమే నను తగినవరములిచ్చి నీనగుమొగ మిటుజూప
వయ్యా దశరథ రాజకుమార॥

37. మాయామాళవగౌళరాగము _ రూపకతాళము.

ప. తులసీదళములచే సంతోషముగా పూజింతు॥

అ॥ పలుమారు చిరకాలము–పరమాత్ముని పాదములను॥తుల

చ. సరసీరుహ పున్నాగ–చంపక పాటల కురవక
కరవీర మల్లికా సు–గంధరాజ కుసుమముల్
ధర నివి యొకపర్యాయము–ధర్మాత్ముని సాకేత
పురవాసుని శ్రీరాముని–వరత్యాగరాజనుతుని ॥తుల

38. తోడిరాగము _ రూపకతాళము.

ప. ఆరగింపవే పా–లారగింపవే!

అ. రఘువీర జనకజాకర–పవిత్రితమైన వెన్న

చ. సారమైన దివ్యాన్నము–షడ్రసయుత భక్షణములు
దార సోదరాదులతో–త్యాగరాజవినుత ॥పాలార

39. మంగళము-సౌరాష్ట్రరాగము-ఆదితాళము.

ప. నీనామరూపములకు-నిత్యజయ మంగళం ॥నీ

అ. పవమాన సుతుడు బట్టు-పాదారవిందములకు ॥నీ

చ. పంకజాక్షి నెలకొన్న-యంక యుగములకు ॥నీ

2. నలినారితీరుగేరు నవ్వుగల మోమునకు ॥నీ

3. నవముక్తాహారములు-నటియించే యురమునకు ॥నీ

4. ప్రహ్లాద నారదాది-భక్తులు పొగడుచుండే ॥నీ

5. రాజీవనయన త్యాగ-రాజవినుతమైన ॥నీ

40. గౌరీరాగము - జంపెతాళము.

ప. జయమంగళం-నిత్య శుభమంగళం॥

చ. మంగళం రుక్మిణీరమణాయ శ్రీమతే
మంగళం రమణీయమూర్తయే తే
మంగళం శ్రీవత్సభూషాయ శార్ఙ్గిణే
మంగళం నందగోపాత్మజాయ! ॥జయ

2. పూతనా కంసాదిపుణ్య జనహారిణే
పురుహూతముఖ దేవహితకరాయ
సూతాయ విజయస్య సుందరముఖాబ్జాయ
శీతకిరణాది కులభూషణాయ ॥జయ

3. కాళియఫణాళి మణిరంజితపదాబ్జాయ
కాలాంబుదశ్యామదివ్యతనవే
కారుణ్యరసవర్షి నయనారవిందాయ
కళ్యాణగుణరత్న వారినిధయే ॥జయ

4. నవనీతచోరాయ నందాదిగోపగో
రక్షిణే గోపికావల్లభాయ
నారదమునీంద్రనుత నామధేయాయతే
నారాయణానందతీర్థగురవే ||జయ

శ్లో. మంగళం భగవన్ విష్ణో మంగళం మధుసూధన!
మంగళం పుండరీకాక్ష! మంగళం గరుడధ్వజ. ౧

నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే
సుభద్రాబలభద్రాభ్యాం జగన్నాథాయ మంగళమ్॥ ౨

మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే
చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళమ్॥ ౩

వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే
పుంసాంమోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్ ॥౪

ఉపనయతు మంగళం వస్సకలజగన్మంగళాలయశ్శ్రీమాన్
దినకరకిరణ నిబోధిత నవనళినదళ నిభేక్షణో రామః. ౫

శ్లో. కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్
కరోమి యద్యత్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి.

క. నీపాద కమలసేవయు
నీపాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపారభూతదయయును
తాపసమందార! నాకు దయసేయుగదే.

శా. నీపద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడువాక్యమ్ములున్
నీపేరంబనిసేయు హస్తయుగమున్ నీమూర్తిపైచూపులున్
నీపాదంబులపొంత మ్రొక్కుశిరమున్ నీసేవపై జిత్తమున్
నీపైబుద్ధులు మాకునిమ్ము కరుణన్ నీరేజపత్రేక్షణా!"
రమా రమణ గోవిందో హరిః

శ్రీ భ గ వ ద్గీ తా స్తు తి గీ త ము లు

41. బేహాగ్ రాగం _ ఆదితాళం　(సంస్కృతం)

ప. జయజయజయజయభగవద్గీతే-జయభవబంధనశమనసుచరితే
1. కాండత్రయ సంశోభితరూపే-ఖండిత త్రిభువన ఘనసంతాపే॥
2. సాంఖ్యకర్మయోగవిలసితే-సంశ్రిత సాధక జనకల్పలతే॥
3. పద్యసప్తశత భవ్యతరంగే-పాపవిభంజన పావనగంగే॥
4. భక్తిజ్ఞాన సోపానశోభితే-పరమయోగి హృత్పద్మభావితే ॥జ
5. భగవత్ శ్రీముఖ పద్మమరందే-పార్థహృత్సదనభరితానందే
6. సకలోపనిషత్ సాగరజాతే-సన్మునిమథవాచలపరిపూతే ॥జ॥
7. శాంతిసుఖప్రద సదమృతకిరణే-జననమరణ భవసాగరతరణే॥
8. భజనసమాజ సుభక్తహృదబ్జే-పరిపూజిత పావనపదాబ్జే॥జ

42. బేహాగ్ రాగము _ ఆదితాళము.　(తెనుగు)

ప. తల్లీ! భగవద్గీతా! మా॥
అ. ఉల్లములందున-నుండుము మాతా　॥తల్లీ
1. తెలివిమాలి నీ-దెస చూడని మము
తులువల మనుచును-దూరము సేయకు　॥తల్లీ
2. మతమత్సరముల-మదిలో నిడుకొని
వదలితి మమ్మా నీ-పదయుగళంబును　॥తల్లీ

3 నిన్ను భజించక-యే కత మే మిటు
ఎన్నో జన్మము-లెత్తుచునుంటిమి ॥తల్లి

4. జననమరణముల-చక్రములోఁ బడు
తనయుల నిపుడొక-దారిని జేర్చుము ॥తల్లి

5. భ్రమకూపంబునఁ - బడి నినుఁ గాంచని॥
మముఁ గని తప్పుల - మన్నింపఁగ దే॥ తల్లి॥

6. చేయూఁత నొసఁగి - శిశువుల మగుమము॥
చేరఁదీసి నీ - చెంతను నిలుప్రము॥ తల్లి॥

7. అన్నిభూతముల - యందు వెలింగెడి॥
హరిఁ దనునటు లో - యమ్మ! దీవింపుము॥ తల్లి॥

8. గీతాభక్తుల - గీతము విని సం॥
ప్రీతిని శాంతిని - వే దయచేయుము॥ తల్లి॥

గే య ము లు

43. శ్రీరాగము _ ఆదితాళము.

భగవద్గీతోద్యానవిహారము భక్తి నొనర్పఁగ పరుగునరండీ
సొగసుగదానినిజూడగనయ్యెడునులువగుత్రోవను జూపెదనండీ॥

1. భారతయుద్ధపు పరిసరభూముల బయలుదేఱిన భాగ్యంబండీ
ధీరుడువ్యాసుడు స్థిరముగనాటినదివ్యోద్యానక్షేత్రముసుండీ

2. రహి నిల కృష్ణుడు రక్తితో పార్థుని రథమును నడిపిన రంగంబండీ ఇహపరసుఖకర హేతుభూతముల నెన్నియొ యాతడు పన్నినదండీ॥

3. ఇలపయినది పదియెన్మిదియా కుకరంబుల పరిమితి రాజిలు నండీ సలలితముగ నట సప్తశతంబుల సద్వృక్షంబులు జెలగును జుండీ॥

4\. ఎప్పుడు వాడని పూవులుచుండీ ఎప్పుడు కుళ్ళని ఫలములు
సుండి తప్పక మనమా ధన్యవనికి జని తలకొక కొన్నిటి
దెత్తము రండి॥

సీ. హృదయమా ! నీమేలు మదిగోరి తెల్పెద
నొకమాట వినుమ నీ వోర్పు గల్గి
యిలలోన హేయమౌ యెనుబది నాల్గు ల
క్షల యోనులందెల్ల జననమంది
మితిలేని వెతలొంది గతిగానలేక
పుట్టుచు గిట్టుచు దుట్టతుదకు
నన్నింట నుత్కృష్టమా నరజన్మ నీ
పుణ్యవశంబున బొందగలిగె

గీ. పరమ పదవిని బొందగా దరుణమిదియె
శంకరుని జేర గడసారి జన్మమిదియె
యిట్టి నరజన్మ మెత్తియు నింకనైన
తండ్రి పేరు గాంచకున్నావు తగునె? నీకు.

సీ. ఆదికారణ మెన్న రాముగాని
స్వభావము లోకమని చెప్పు బౌద్ధమతము
జగమబద్ధము బ్రహ్మసత్యం బటంచు
యెంతయు బోధపరుచు అద్వైత మతము
సగుణు డీశుడు ప్రపంచము వాని
యిచ్ఛావిభూతియంచు గణించు ద్వైతమతము
ఇహమె నిక్కము పరంబెల్ల కల్లయటంచు
దెల్లముసేయు నాస్తిక మతంబు

గీ. ఇన్ని మతములలో సార మెంచి యెంచి
దయయు సత్యంబు మొదలగు ధర్మబుద్ధి
నాల్గిటఁ గ్రమముగనిల్పి నయముమీర
జయము మనమందవలయు నో జనములార.

సీ. వేదధర్మంబులఁ బ్రీతితో నెరపెడివాడును కష్టముల్
బడయుచుండు, భక్తితో దైవముఁ భజియించువాడును
దైవప్రబాధల దైన్యమందు, ప్రబల విద్యను ధనంబార్జించు
వాడును దారిద్ర్యదశచేత దల్లడిల్లు, పాలనం బొనరించు
వరుస ప్రభుండైన కొందరి జనులచే నిందబొందు

గీ. దుర్జనుడును కొందరిచేత స్తోత్రమొందు, కామియును నొక
వ్వడు మోక్షకామియౌను, మంచి బలవంతుడును నొక
వ్వడు వంచితుడగు సృష్టిమహిమ మేరిణెంచ జెల్లునొక్కొ.

సీ. కాయ కష్టము జేసి కడుపు నింపుచునుండు
డెట్టివేళను సత్యమే వచించు
డిరుగు పొరుగువారి పరిచర్య సలుపుచు
సేవింపు డావుల చిత్తమలర
నిదుర మేల్కాంచు తఱి నిదురించుటకు ముందు
శ్రీరామనామంబు జింతజేయు
డెటువంటి వారిపై నిసుమంత పగలేక
నిరతంబు శత్రేమ నెఱపుచుండు

తే. గీ. డీవిధంబుగ నడచిన నిహపరముల
శాశ్వతంబగు సౌఖ్యంబు సంభవించు
పరమపావనులగు మన బ్రహ్మవిదుల
తలచి నుడివిన భారతధర్మ మిదియ.

తే. గీ. మేఘపంక్తుల దాగిన మెరపువోలె
కందరంబుననున్న సింగంబు పగిది
దాగియున్నది నీలోన సద్ధైర్యశక్తి
సోదరా లెమ్ము భారతశోక ముడుప.

గీ. అరణి నంతర్గతాగ్ని కణాలిపోల్కి
వసుధయందలి యాతః ప్రవాహలీల
అణగియున్నది నీలోననంతశక్తి
సోదరా లెమ్ము భారతశోక ముడుప.

గీ. వసుధలో లోనదాగిన పసిడిగనిః
రాచబిడ్డవు పరకుల రక్షితుడవు
మరచిపోతివి నీలోనిమహిమ తెరగు
సోదరా! భారతశోకముడుప.

సీ. మత్స్యరూపముదాల్చి మానుగా
సోమకుని జలధి మధ్యంబున జంపితీవు
కూర్మంబయి దేవకుదురంబు వీపుపై
గోరి వధియించిన గురుడవీవె
ఘోణివై హేమాక్షు ఘోరజలధిలోపల
బోరికొని భూమిని బ్రోవలేదె
నరసింహమూర్తివై బరిమార్చి యాహేమ
కశ్యపుని ప్రహ్లాదుని గావలేదె

తే. అరయు మరగుజ్జువై బలినణప లేదె
రాముడనుపేర రాజుల ద్రాల్చలేదె
కాన నేనెంచ నేనెంతటివాడ నోర
రఘుకులాంబుధిచంద్ర శ్రీరామచంద్ర.

సీ. అతిభక్తిపరుఁడైన యర్జును గుర్రాల
కాళిందినదిలోన గడగినాను
సర్వార్పణముసేయజాలి నాబలియింట
కావలివాడనై గాచినాను
కోటి కంటగదీసి దాడింపగా నమ్మి
నోర్చి నోరెత్తక మెచ్చినాను
ఎలమి నరసింహామే దాల్చినట్టి
హుండియా చెల్లించినాను

తే. ప్రతియత్తి యీడెక్క యీనాఁడు
సక్కుకై కాంతనగుచు నత్త
మామల పాదములొత్త వలసె
భక్తుల నిమిత్తమే గదా యెన్ని పాట్లునైన.

—* శ్రీ గాంధిమహాత్ముని భావము *—

సీ ప్రత్యూదయంబును ప్రథమ కార్యంబుగ
నే జేతుగాక! యీ నియతి ప్రతిన
జగతి నే నెవరికి జడియకుండెద గాక!
భగవంతునకె భయపడుదుగాక!
ఎవ్వారియెడల నే నెడదలో ద్వేషంబు
లేకుండెదనుగాక! లేశమేని
అన్యాయమునకు నే నణగకుండెద గాక!
ఎవరెన్ని దెల్పిన నించుకేని

తే. గీ. కల్లయాదాని నిజముచే ఖండనంబు
జేయ జూచెదగాక! సుస్థిరముగాను

మిథ్య నెదిరించు పట్టున మేటిబాధ
లొందువ నెన్నేని నోర్పుతో నుందుగాక!

సీ. సలిలంబు నీకు నీగలిగిన వానికి
నిష్టమృష్టాన్నంబు నిడఁగదయ్య
కేల్మోడ్ప నిను వానికిఁ భక్తిసంయుక్తి
జాగిలి జోహారు సలుపవయ్య
తృణకణంబేని నీకిచ్చు పుణ్యాత్ముని
కపరంజి నాణె మీయంగదయ్య
కడగండ్ల నీకు దోడ్పడెడివానికి నీ శ
రీరమే గోసి యర్పింపవయ్య
తే. గీ. యిచ్చుచో నొంచు దశగుణం బిచ్చుటొప్పు
గీడు గూర్చిన మేలుగల్గించు టుజవు
చిత్తవాక్కర్మ శుద్ధియై జేయు వీని
నవ్వ డాతండ గెల్చుబో! యిజ్జగంబు.

సీ. కన్నులుండియు నినుఁ గాంచగోరని
వానికన్నను గ్రుడ్డివాడు మేలు
కరములుండియు నినుఁ గైసేయనొల్లని
వానికన్నను లేనివాడు మేలు
నాల్కయుండియు నినుఁ సన్నుతించగబోని
వానికన్నను మూగవాడు మేలు
ధనము గల్గియును సత్కర్మలు జేయని
వానికన్నను పేదవాడు మేలు
నిను దలంచకున్న మనుజునికన్నను
పశువులైన మేలు పరమపురుష

భక్తపారిజాత భవ్యగుణవ్రాత
విగతతృష్ణ వేదవేద్య కృష్ణ!

ఉ. ఏయెడ నెవ్వానికి నెన్నిరేల్ సుఖముగాని దుఃఖముఁగాని
విస్ఫుటపూర్వచరితాత్మకర్మవశతఁ భోక్తవ్యమైయుండునో
ఘటనాచాతురి వ్రాళ్లఁగట్టుచు బలత్కారంబుగా వానినచ్చ
టికిఁ దోడ్కొనిపోయి దానిగుడిపించుఁ దైవమన్నాళ్లోఁగిఁ.

—* పరబ్రహ్మదండకము *—

శ్రీరామ! శ్రీకృష్ణ! ఓశ్యామలాకార! నాకన్నతండ్రీ! జగన్నాథ! ఆపన్నివారా! ప్రసన్నాత్మసంవాస! దేవాదిదేవా! మహాదేవ గోవింద! సర్వాత్మ! సర్వజ్ఞ! సర్వేశ! సర్వార్చితా! సర్వశక్తా! హరీ! సర్వసాక్షీ! ముకుందా! పరంధామ! సర్వోత్తమా! నామరూప క్రియాశూన్య! జ్ఞానస్వరూపా! అనంతాచ్యుతా! అప్రమేయా! కళాపూర్ణ! తేజోమయా! సత్యసంకల్ప! స్వామీ పరబ్రహ్మమూర్తీ! మొదల్ నిన్ను నేనెన్నడో యెందుకో బాసి అన్నింటియందున్న నిన్గానకెన్నెన్ని జన్మంబులో యెత్తి, యెన్నెన్ని కష్టంబులో పొందితిఁ కుందితిఁ కందితిన్ కావు కావంటి, ఈనేలపై మున్నుపుట్టంగనే గట్టిగానీకు చేయెత్తి నాయాత్మలో మ్రొక్కితిఁ దీనబంధూ దయాసింధు ఈజన్మమందైన నీవాడనౌ నాకు కైవల్యమీవే తగఁ వేఱు నేనేమియుఁ గోర, నోదేవ! దివ్యప్రభావా! భవత్ జ్ఞాననేత్రంబుతో జూడ, శబ్దంబులోనుండు శబ్దంబుపల్కు, స్పర్శంబులోనుండు స్పర్శంబు నీతాకు, రూపంబులోనుండు రూపంబు నీరూపు, సారంబులోనుండు సారంబు నీతీపి, గంధంబులోనుండు

గంధంబు నీతావి, ఈమన్ను నీమాయ, ఈమిన్ను నీమాయ, ఈగాలి నీమాయ, ఈనీరు నీమాయ, ఈవెల్గు నీమాయ, ఈపంచభూతాత్మకంబౌ ప్రపంచంబు నీమాయ, ఈనేను నీ మాయ, నీమాయయె అన్నియున్, నీవు గమ్మన్నమాత్రాన గాదా? అదేదైన, రమ్మన్న మాత్రాన రాదా? అదేదైన, పొమ్మన్నమాత్రాన పోదా? అదేదైన, నీబల్మియే బల్మి, నీకల్మియే కల్మి, నీవిద్యయే విద్య, నీబుద్ధియే బుద్ధి, నీ తెల్వియే తెల్వి, నీ తేటయే తేట, నీయిచ్ఛయే యిచ్ఛ, నీ రచ్చయే రచ్చ, నీమాటయే మాట, నీపాటయే పాట, నీ యాటయే ఆటయౌ, నీవు నీవే, మహాసత్త్వసంపన్న! నావట్టి గొడ్డైన యీనీవు నాపట్టయైనన్ ననున్ బట్టువారేరి? నన్ గట్టువారేరి? నన్దిట్టువారేరి? నన్ గొట్టువారేరి? ఇందైన అందైన యెందైన నాకడ్డమౌవార లేరీ? విచారింప నీయాజ్ఞ లేకున్న నాకైన నల్లాడునా? నీవు తోడైన ఏమిన్ను నన్ వంచు ఏనీరు నన్ ముంచు, ఏగాలి నన్ దూల్చు, ఏఅగ్ని నన్ గాల్చు, ఏశక్తి నన్ గూల్చు, ఏమైన నన్నేమి చేయున్, బవల్ రేయి బ్రహ్మాండ భాండంబు నందంతటన్ తాండవంబాడు నీదివ్య తేజంబె యుక్కొంగినాకున్ సదా దిక్కు నీవొక్కడే ఎక్కడన్ మక్కువన్ జీవులన్ గావగా, బ్రోవగా, నీకె చెల్లున్, ప్రభూ సద్గురూ! ఓం నమో శ్రీపరబ్రహ్మణే, పాహిమాం పాహిమాం పాహిమాం ఓం నమస్తే నమస్తే నమస్తే నమః.

—*—

నీలాంబరిరాగము - ఆదితాళము

ప. ఎన్నగా మనసుకు రాని-పన్నగశాయి సొగసు
పన్నుగ గనుగొనని కన్ను లేలే-కన్ను లేలే-కంటి- మిన్న లేలే

చ. మోహాముతో నీలవారి-వాహాకాంతిని గేరిన
అ. శ్రీహరిని గట్టుకొనని-దేహామేలే - దేహామేలే - యీ
గేహామేలే

2. సరసిజ మల్లె తులసి విర-జాజి పారిజాతపు
విరులచే పూజించని-కరము లేలే-కరము లేలే-కాపురము లేలే

3 మాలిమిని త్యాగరాజు-నేలిన శ్రీరామమూర్తిని
లాలించి పొగడని-నాలి కేలే-నాలి కేలే-సూత్ర- మాలి కేలే॥

సీ॥ తొమ్మిదిచిల్లుల తోలుతిత్తియగాని
కాన్తి గల్గిన వజ్రఘుటముగాదు
నిమిష నిమిష మిందు నీచులూరునెగాని
పునుగు జవ్వాజీలు పుట్టబోవు
మల మూత్ర దుర్గంధ మాంసరక్తమె కాని
ఘన సువాసనమైన తనువుగాదు
నీచమా యిదివట్టి నీటి బుగ్గయెగాని
కలకాల మిలలోన నిలువబోదు

గీ. భ్రమల బుట్టించి నమ్మించి పాసిపోవు
నిట్టి దేహంబుపై భ్రాన్తియేల నీకు
హృదయమా! నిన్ను రక్షింపదు తుదకు నీదు
కన్నతండ్రియె గతిగాక గలరె? యొరులు.

సీ. పుట్టినదాడిగా భూతజాలంబును
కారుణ్య దృష్టితో గాంచినావు
ధనధాన్య సంపదల్ త్యాగమ్ము గావించి
వైరాగ్యభావాన వరలినావు
తీవ్రజిజ్ఞాసతో దివ్యతత్త్వంబును
జెందగా ధ్యానంబు జేసినావు
కాపట్య మెఱుగక నోపికతో సదా
సాధుకోటికి సేవ సలిపినావు
తే. స్వార్థభావంబు విడనాడి జంతుకోటి
కష్టములదీర్ప నడుమును గట్టినావు
వేంకటేశ్వర స్వామిజీ విమలహృదయ
కొనుము మా ప్రేమకుసుమముల్ కూర్మితోడ.

సీ. సత్యధర్మంబుల జవదాటి నడువక
బటుభోగములచేత బట్టువడక
విషయసౌఖ్యంబుల విడనాడి సతతంబు
పరమాత్మ భావతత్పరత మెలగి
సత్కార్య మనినచో సంతోషమున బొంగి
తను మన వాక్శక్తి ధారబోసి
యార్షమతంబన్న హర్షాబ్ధిలోమున్గి
భవసాగరంబన్న భయముజెంది
తే. గీ. నిత్య నిర్మల పదమునే నెమకి నెమకి
శాంతి దాంత్యాది గుణముల సంగ్రహించి
పూర్ణనిర్వాణపదమును బొందినావు
వేంకటేశ్వరస్వామిజీ విమలహృదయ.

సీ. గాంధీమహాత్ముని ఘనత్యాగమును విని
ఖద్దరు వస్త్రముల్ గట్టినావు
మలయాళస్వామిచే మంత్రంబు గైకొని
జపతపముల్ సదా సలిపినావు
పూర్వకాలపు మౌనిపుంగవులట్టుల
వనవాస దీక్షతో వరలినావు
సాత్వికాహారంబు సరిపడ గైకొని
సత్కార్యముల నెన్ని సలిపినావు
తే. త్యాగశీలకు విలువయై తనరు నీదు
జీవితము సర్వమానవ భావితంబు
వేంకటేశ్వరస్వామి వివేకభావ
కొనుము మాప్రేమ కుసుమముల్ కూర్మితోడ.

సీ. మిత్రలోకంబన్న మిన్నంటు నీప్రేమ
మాహాత్మ్య మెట్టిదో మాన్యచరిత
కాయకష్టము జేసి కడుపు నింపుడమన్న
నీభావగరిమ మేమి నిర్మలాత్మ
వేదాన్తవిజ్ఞాన వీధుల చరియించి
తన్మయ మొందు నీతత్వమేమి
నియమకాలంబున నిద్రమేల్కొనునట్టి
నీ యోపి కెట్టిదో నిర్మముండ
తే. గీ. తలప నీజీవితములోని ధర్మములను
బటుతరంబగు యాదర్శప్రాయములగు

వేంకటేశ్వరస్వామి! వివేకహృదయ
కొనుము మా ప్రేమకుసుమముల్ కూర్మితోడ.

సీ. యౌవనవయసులో నఖిలసుఖమ్ముల
బాసి వనమ్ములో వాసముండి
పుణ్యకార్యంబుల పూర్తిగా నొనరించి
కర్మయోగంబును గడిపితీవు
గురుకులంబునయుండి గోప్యవేదాంతంబు
శాంతిగ చింతన సలిపితీవు
నామసంకీర్తన ప్రేమతో జేయుచు
భక్తిమార్గంబున ప్రాకితీవు
తే. కడకు పదిరెండు యేడులు గడపి యిట్లు
పూర్ణనిర్వాణపదమును బొందితీవు
వేంకటేశ్వరస్వామి వివేకహృదయ
ధన్యమని నీదు జన్మము దలతుమయ్య.

—*—

1. కర్మయోగము.

సద్గురుమూర్తి బోధించిన లక్ష్యార్థమునందు దృష్టిని నిలిపి యుంచుము. ప్రపంచమున వ్యవహరించునపుడు సర్వాంతర్యామియగు పరమాత్మను ప్రతిముఖమునందును దర్శించుచు వినయముగ ప్రవర్తించుము. వైరాగ్యమును మించిన ఐశ్వర్యము లేదు. రహస్యముగ జేయు మంచిచెడ్డల గుర్తించు సాక్షియే భగవంతుడు. తా జేయు మంచి చెడ్డలగూర్చి సాక్షిమాత్రుడగు పరమాత్మ వీక్షించుచున్నాడని గ్రహించినవారు పాపములు జేయజాలరు. భగవన్నియమమునకు విరుద్ధమగు దుష్కర్మనొకదానిని నీవు చేసిన యెడల మహాదుఃఖము ననుభవింతువు. నీ శరీరము కామోపభోగములకొఱకు గాదు. స్వార్థరహితమగు సర్వప్రాణికోట్ల సేవకొఱకే. లోకకళ్యాణకరమగు కార్యములే నీకాచరణయోగ్యములు. జాతి, మత భేదములను పాటింపక, సర్వులాత్మస్వరూపులని భావించుము. కర్మనిష్ఠుడగువాడే యోగి. కర్మఫలమును విడుచువాడే త్యాగి. కర్మయోగమే భుక్తి, ముక్తి. నీ మనోవాక్కాయములద్వారా ఏ జీవికి అపకారము జేయక మెలగుము. నీవెప్పుడు భగవత్స్మృతిని బోగొట్టుకొందువో అప్పుడే దుర్విషయములు నీ మనస్సులో జేరగలవు. పరమాత్మయందు సమర్పణభావముతో నీవు కర్మను జేయుము. ఆర్తితో "హే భగవన్! నేను, నాది తృణమైనను లేదు. సర్వము నీదే" నని నీ త్రికరణములను సర్వస్వమును భగవదర్పితము జేసి జీవింపుము, భాషింపుము,

పనిచేయుము, భుజింపుము, నిద్రించుము. ఇట్టి కర్మయోగి నిద్ర నిద్ర గాదు. యోగము.

2. భక్తియోగము.

సమస్తమార్గములలో భక్తిమార్గమే అత్యంత సులభ మార్గము. దీని నాచరించుటకు తర్క వితర్క పాండిత్యము లలో పనిలేదు. అహంకార మమకారములను విడచి జ్ఞాన పూర్వకమగు భక్తి నభ్యసింపుము. జ్ఞానమువలన అజ్ఞానము నశించి, రామనామముయొక్క నిజస్వరూపము గోచరించును. "రమన్తే యోగినః అస్మిన్" ఇతి వ్యుత్పత్త్యనుసారము, యోగుల హృదయకోశములందు క్రీడించునట్టి ఆనందస్వరూపము రామనామము. అట్టి రామనామము అవిద్యాతత్కార్యభూత మగు సంసారమును నివర్తింపజేయును. భగవచ్చింతనాసక్తులై కొందరు ధ్యానింపుదురు. ఆ ప్రేమచే గానము చేసెదరు. కొందరాతని లీలకథాజాలమును విని పరవశులయ్యెదరు. కొందరు ఆ మహామహుని అద్భుతవిషయములను వచించె దరు. ఇతర విషయములందు వీరి కిష్టముండదు. భగవంతుని కంటె భగవన్నామమునకు మహాత్ము లెక్కువ విలువనిచ్చిరి. శ్రీరామనామప్రభావమువలన హనుమంతుడు సముద్రమును దాటగలిగెను. శ్రీరామచంద్రమూర్తియో, వారధికట్టియే దాటగలిగిరి. దారుణకష్టములలో సైతము నన్ను రక్షించినది రామనామము. నిరాశాసమయములలో సైతము నాకు ఆశా జ్యోతిని చూపించినది శ్రీరామనామమే. నాజీవితమునకు రామ నామమే రక్షకము.

పనిచేయును, భుజించును, నిద్రించును. ఇట్టి కర్మయోగి నిద్ర నిద్ర గాదు. యోగము.

2. భక్తియోగము.

సమస్తమార్గములలో భక్తిమార్గమే అత్యంత సులభ మార్గము. దీని నాచరించుటకు తర్క వితర్క పాండిత్యము లతో పనిలేదు. అహంకార మమకారములను విడచి జ్ఞాన పూర్వకమగు భక్తి నభ్యసింపుము. జ్ఞానమువలన అజ్ఞానము నశించి, రామనామముయొక్క నిజస్వరూపము గోచరించును. "రమన్తే యోగినః అస్మిన్" ఇతి వ్యుత్పత్త్యనుసారము, యోగుల హృదయకోశములందు క్రీడించునట్టి యానందస్వరూపము రామనామము. అట్టి రామనామము అవిద్యాతత్కార్యభూత మగు సంసారమును నివర్తింపజేయును. భగవచ్చింతనాసక్తులై కొందరు విలపింతురు. ఆ ప్రేమచే గానము చేసెదరు. కొందరాతని లీలకథాజాలమును విని పరవశులయ్యెదరు. కొందరు ఆ మహామహుని అద్భుతవిషయములను వచించెదరు. ఇతర విషయములందు వీరి కిష్టముండదు. భగవంతుని కంటె భగవన్నామమునకు మహాత్ము లెక్కువ విలువనిచ్చిరి. శ్రీరామనామప్రభావమువలన హనుమంతుడు సముద్రమును దాటగలిగెను. శ్రీరామచంద్రమూర్తియో, వారధికట్టియే దాటగలిగిరి. దారుణకష్టములలో సైతము నన్ను రక్షించినది రామనామము. నిరాశాసమయములలో సైతము నాకు ఆశా జ్యోతిని చూపించినది శ్రీరామనామమే. నాజీవితమునకు రామ నామమే రక్షకము.

విద్యాభ్యాస కాలమందు వ్రాసియుంచిన కర్మ, భక్తి, జ్ఞాన యోగములు. ఓమ్ తత్ సత్.

పెనమలూరు 1-1-1953 } ఇట్లు వీరి అనుచరులు
శ్రీ భజనబాబు
శ్రీపరమాత్మానందాశ్రమము, పెనమలూరు, కృష్ణాజిల్లా.

* శ్రీ రామ నామ ప్రభావము *

కలౌ స్మరణాన్ముక్తిః — ఈ కలియుగమునందు భగవత్స్మరణమువల్లనే ముక్తి లభించును.

మహాత్మా గాంధీజీ భావన—

ఆపదలలో గొప్ప ఆపద దైవచింతన లేకుండుటయే, సంపదలలో గొప్పసంపద ఆధ్యాత్మిక యైశ్వర్యమే నా యైశ్వర్యమని తలంచుట.

భగవంతునియందు నాకు పూర్ణవిశ్వాసము గలదు. నా జీవితములోని అనేక కష్టసమయములందు దేవుడు నన్ను రక్షించెను. భోజనము చేయుట, నీరుత్రాగుట, కూర్చుండుట, మొదలగునవి మనకెట్లు నిజమో అట్లే పూజ, ప్రార్థన, ధ్యానముగూడ సత్యము. ఇది అంధవిశ్వాసము గాదు సంపూర్ణమైన సత్యము. నా స్వానుభవమని, గాంధీజీ తన ఆత్మకథయందు నుడివిరి. కనుక భగవంతుడే నన్ను రక్షించును. అను దృఢమైన విశ్వాసమును గలిగియుండుడు. మన భూములుగాని మన బంధువులుగాని, మన గవర్నమెంటుగాని మనలను

రక్షింపజాలరు. రక్షకులకు రక్షకు డెవ్వండో వానియందే పరిపూర్ణ విశ్వాసమును గలిగి యుండవలయును. ఆటంబాంబు గాని, దానికంటె వెయ్యిరెట్లు శక్తిగలది వచ్చినను నన్ను దైవశక్తియు లేనిదే యేమియుచేయజాలదు. అని ధైర్యముగా నుండుడు. 5 సంవత్సరముల బాలుడు రాజాధిరాజై దేవతలను సయితము తన యాజ్ఞనందుంచుకొన్న హిరణ్యకశిపుని హరి భయపెట్టెను. కాని ప్రహ్లాదుడు భయపడి తన్ను రక్షించమని కోరలేదు. పరిపూర్ణ శరణాగతి నొందినవాడు గనుక సర్వమును భగవంతునియందే భారముంచినాడు గాన క్రూరుడై తండ్రి పర్వతశిఖరములనుండి త్రోసివేయించినను భగవంతుడు ప్రహ్లాదుని తన హస్తమునుండి జారనీయలేదు. ఆతని శక్తి యున్నందున నిప్పు, విషముగూడ అనుకూలమునందున్న దాయెను. త్రేతాయుగమునందు జన్మించిన రాముని కలియుగమునందు నమ్మి రామదాసు స్మరణచేసి ఆరాముని యాలయకైంకర్యమునకు ఖర్చుచేసిన హుండీ (ఆరులక్షల పైకము) తానీషాకు రామలక్ష్మణులచే నొసగబడెను. ఓహో! భగవన్నామమునందు విలువ యేమని చెప్పవచ్చు. భూభారమును వహించు ఆదిశేషుని మహానుభావుడైన శివుడు ఆభరణముగ ధరించెను. అంతటి పరమేశ్వరుడుగూడ నిరంతరము రామనామస్మరణము చేయుచు పార్వతీదేవికి తారక మంత్రము నుపదేశించెను. మరియు శ్రీరామ మహిమను పార్వతీదేవి కీవిధముగ జూపించెను.

రావణాసురుడు సీతామహాదేవిని మాయావేషముతో వచ్చి గెడ్డతో నెత్తికొని పోయినప్పుడు రామచంద్రమూర్తి

విలపించుచున్నాడని చెప్పెను. అప్పుడు పార్వతీదేవి స్వామీ! శ్రీరాముడు దేవుడైన విలపించునా యని యడిగెను. ఈశ్వరుడు రాముడు దేవుడు కాడో నీవే పరిశోధించుకొను మనెను. ఆమె సీతాదేవి యవతారము ధరించి విలపించుచున్న రామునికి యెదురాయెను. అంతట సర్వజ్ఞుడైన రాముడు తల్లీ! కైలాసమును వదలి యిచ్చట కెందుకు వచ్చినావని అడిగెను. అంతటామె రాముని ఆహా! రాముని మానవునిగా తలంచితి నని విచారించి, రాముని దైవముగా నిశ్చయించుకొని నమస్కరించి కైలాసమునకు వెళ్లి సాంబశివునితో రాముడు దేవుడే నను నా సంశయము తీరెనని పార్వతీదేవి రామమంత్రస్మరణ చేయుచుండెను.

శ్రీకృష్ణ భగవానుడు గీతయందు చెప్పినట్లు—

శ్లో. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాన్తిం నిగచ్ఛతి
కౌన్తేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి.

తా. నన్ను స్మరణ జేయువాడు అతిత్వరగా ధర్మాత్ముడై శాశ్వతమైన పరమశాంతిని బొందుచున్నాడు. నాయందు భక్తిగలవాడు చెడడని భేరీవాయించి రెండుచేతులు పైకెత్తుకొని ప్రతిజ్ఞచేసి చెప్పు మర్జునా! యని సెలవిచ్చెను.

మరియు—

శ్లో. అపిచేత్సుదురాచారో భజతే మామనన్యభాక్
సాధురేవ సమంతవ్య స్సమ్యగ్వ్యవసితో హి సః.

తా. మిక్కిలి దురాచారము గలవాడైనను అనన్యమనస్సుగలవాడై నన్నే యెవడు భజించునో, వాడు స్థిరమైన

మనోనిశ్చయము గలవాడు గావున వాడు సాధువుగా నెన్న దగినవాడే. దీనివలన పాపిసహితము భగవద్భజన చేయవచ్చునని తేలుచున్నది. శ్రీ ఉడియా బాబాగారు చెప్పినదిజూడుడు. భగవద్భజన చేయువాడు పాపియని యెట్లు పలుకనగును. కాని అక్కడక్కడ పాపాత్ములుగూడ భజనయందు ప్రవృత్తి గలిగి యుండుటయు కనబడుచున్నారు.

ఇట్టిది సూరదాసునకువలె భగవత్కృపచేతనే గలుగుచున్నది. పాపియగువాడు భజనయందు లీనముగాడను నియమము లేదు. మరియు నీ విషయములో నేనొక ఘటనమును స్వయముగ జూచితిని. ఒకసారి తారకేశ్వరమునందు ఒకగొప్ప ధనికుడు వచ్చెను. అతడు మిక్కిలి దుర్వ్యసనము గలవాడు. ఒక దినము నతడు మద్యపానము చేయుచుండెను. ఆసమయములోనే ఆమార్గమున నొక మహాత్ముడు వెళ్లుచుండెను. ఆ త్రాగుబోతు ఆమహాత్ముని బిలిచి రా ఒకలొట్టెడు త్రాగుడు. అనెను. అప్పు డామహాత్ముడు అరే నీకు పాయ్యేకాలము కొద్దిలోనే యున్నట్లున్నది. ఇంక నీదుర్వ్యసనము నీకు తృప్తి కాలేదా? యనెను. ఈమాత్ర మని మహాత్ముడు వెడలిపోయెను. కాని అప్పటినుండి వానిచిత్తము మారమొదలిడెను. సారాయి జాడీలన్ని బద్దలు గొట్టెను. అంత నతడింటికి తిరిగివచ్చి భజనలో మునిగిపోయి పదునైదుదినములకు తినుబండారములను బెట్టుకొని యింటిలోపల తలుపు వేసుకొని భజనలో నుండెను. కొలదరోజులకు ఆయన ధర్మపత్నిగూడ అట్లే భజనయందు లగ్నమాయెను. ఈవిధముగ వారు తరించిరి.

శ్రీ అన్నపూర్ణాష్టక స్తోత్రమ్

నిత్యానందకరీ వరాభయకరీ సౌందర్య రత్నాకరీ
నిర్ధూతాఖిల ఘోరపావనకరీ ప్రత్యక్షమాహేశ్వరీ ।
ప్రాలేయాచల వంశపావనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 1 ॥

నానారత్న విచిత్ర భూషణకరీ హేమాంబరాడంబరీ
ముక్తాహార విలంబమాన విలసద్వక్షోజ కుంభాంతరీ ।
కాశ్మీరాగురు వాసితారుచికరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 2 ॥

యోగానందకరీ రిపుక్షయకరీ ధర్మార్థ నిష్ఠాకరీ
చంద్రార్కానల భాసమానలహరీ త్రైలోక్య రక్షాకరీ ।
సర్వైశ్వర్య సమస్త వాంఛితకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 3 ॥

కైలాసాచల కందరాలయకరీ గౌరీ ఉమా శాంకరీ
కౌమారీ నిగమార్థ గోచరకరీ ఓంకార బీజాక్షరీ ।
మోక్షద్వారకవాటపాటనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 4 ॥

దృశ్యాదృశ్య ప్రభూతవాహనకరీ బ్రహ్మాండభాండోదరీ
లీలానాటక సూత్రభేదనకరీ విజ్ఞానదీపాంకురీ ।
శ్రీ విశ్వేశమనఃప్రసాదనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 5 ॥

ఉర్వీ సర్వజనేశ్వరీ భగవతీ మాతా కృపాసాగరీ
వేణీ నీలసమానకుంతలధరీ నిత్యాన్నదానేశ్వరీ ।
సర్వానందకరీ సదా శుభకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 6 ॥

ఆదిక్షాంతసమస్తవర్ణనకరీ శంభోస్త్రిభావాకరీ
కాశ్మీరా త్రిజలేశ్వరీ త్రిలహరీ నిత్యాంకురాశర్వరీ ।
స్వర్గద్వార కవాటపాటనకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 7 ॥

దేవీ సర్వవిచిత్ర రత్నరచితా దాక్షాయణీ సుందరీ
వామా స్వాదుపయోధరప్రియకరీ సౌభాగ్య మాహేశ్వరీ ।
భక్తాభీష్టకరీ దశాశుభకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 8 ॥

చంద్రార్కానల కోటికోటిసదృశా చంద్రాంశుబింబాధరీ
చంద్రార్కాగ్ని సమానకుంతలహరీ చంద్రార్క వర్ణేశ్వరీ ।
మాలా పుస్తక పాశసాంకుశధరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 9 ॥

క్షత్రత్రాణకరీ మహాభయకరీ మాతా కృపాసాగరీ
సాక్షాన్మోక్షకరీ సదా శివకరీ విశ్వేశ్వర శ్రీధరీ ।
దక్షాక్రందకరీ నిరామయకరీ కాశీపురాధీశ్వరీ
భిక్షాం దేహి కృపావలంబనకరీ మాతాన్నపూర్ణేశ్వరీ ॥ 10 ॥

అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ।
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతీ ॥ 11 ॥

మాతా చ పార్వతీ దేవీ పితా దేవో మహేశ్వరః ।
బాంధవాః శివభక్తాశ్చ స్వదేశో భువనత్రయమ్ ॥ 12 ॥

ఇతి శ్రీమచ్ఛంకరాచార్య విరచితం అన్నపూర్ణాష్టక స్తోత్రమ్

శ్రీ భ జ న స మా జ ము.

దేవుడనగా ఎవరు?

కొలంబియా బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ డైరెక్టరు లండన్ పట్టణమున గాంధీమహాత్ముని దర్శించి, దేవుడనగా యెవరని అడిగిరి.

1. మహాత్ముని జవాబు:- నాచుట్టునున్న ప్రపంచము లోని సర్వ చరాచర వస్తువులు పుట్టుట, లయించుట మున్నగు పరిణామములు జెందుచున్నను, వీనికాధారమై యెట్టి పరిణామమును చెందనట్టి, చైతన్యశక్తియే దేవుడు. ఏలన మృత్యుమధ్యమందు అమరత్వమును, అంధకారమున అంతర్జ్యోతిని. అనంత దుఃఖమధ్యమున ఆనందానుభవమే దేవుడు. ఈ ప్రత్యుత్తరమునకు లక్షరూప్యములను మహాత్మాజీకి ఆ కంపెనీ డైరెక్టరు పారితోషికముగ సమర్పించి కృతకృత్యుడనైతినని విన్నవించెను. ఆత్మకథ. గాంధిజీ:- భగవంతునియందు నాకు పూర్ణవిశ్వాసము కలదు నాజీవితములోని అనేక కష్ట సమయములయందు దేవుడు నన్ను రక్షించెను. భోజనము చేయుట, నీరు త్రాగుట, కూర్చుండుట మొదలగునవి మన కెట్లు నిజమో అట్లే పూజ ప్రార్థన ధ్యానము కూడా సత్యము. ఇది అంధ విశ్వాసముకాదు. సంపూర్ణమైన సత్యము. స్వానుభవము అదియే దేవుడు!

2. శ్రీ రామకృష్ణపరమహంస:- ఒకటి దేవుడు. సున్న జీవుడు. సున్నకు విలువ సంఖ్యయున్నప్పుడే. లేనిచో దానికి విలువేది? అలల కాధారము సముద్ర మెటులనో, ఈ సగుణ ప్రపంచమున కాధారమైన అనంత చిదాకాశరూపుడే దేవుడు!

3. శ్రీ వివేకానందస్వామిజీ:- లోకసేవకై ఈదేహమును నాహుతి యొనర్చుడు. తీవ్ర తపస్సుచేసి నేను గ్రహించిన మహత్తర సత్యమిది. దృశ్యమానమగు ఈ సమస్త జీవ కోటియు దైవస్వరూపమే! అస్తి, అస్తియను సద్భావమును ప్రకటింపుడు. ఆస్తిక్యభావమును వృద్ధి జేసుకొనుడు. నాస్తి, నాస్తియను వ్యతిరేక భావములను వదలుడు. ప్రతిజీవియందును అనంత దైవశక్తి కలదు. తన పురుషప్రయత్నమువలననే తనుద్ధరించుకొన వలయును. తన్ను తానుద్ధరించుకొను పురుష ప్రయత్నమే దేవుడు!

4. శ్రీ స్వామి రామతీర్థ :- దేవుని భక్తియనగా బిచ్చ మెత్తుట, యేడ్చుట, తల బాదుకొనుట కాదు. అనిర్వచనీయ మగు సమత్వదృష్టి సర్వస్వరూపియగు దేవుని అన్నిటిలో దర్శించుటయే ఈ విశ్వమంతయు దేవుని స్వరూపమేననియు, అదియే తన స్వరూపమనియు, తెలుసుకొనుటయే దేవుడు!

5. శ్రీ రమణభగవాన్:- తాను విశ్వము. దైవము వేరు కాదు. ఒకటే! తన్నెరుంగుటయే దేవునెరుంగుట అదియే దేవుడు!

6. శ్రీ అరవిందులు:- తాను విశ్వరూప భగవానుని ప్రేమించి, వారికి తన్నర్పించుకొనుచో, తనకు విశ్వరూపమునే భగవానుడు ప్రసాదించును. సముద్రమునకు తన్నర్పించు కొన్న ఉప్పుకణువు సముద్రమే తానగుచున్నది కదా.

7. శ్రీమహర్షి మలయాళ స్వామివారు:- అజ్ఞానదృష్టి, జ్ఞానదృష్టి, విజ్ఞానదృష్టి అని దృష్టులు మూడు విధములు

కులమును మాత్రమే చూచుట అజ్ఞానదృష్టి. సర్వులలోని గుణములను పరికించుట జ్ఞానదృష్టి. ఈవిశ్వమంతయు భగవత్ స్వరూపముగ చూచుట విజ్ఞానదృష్టి అట్టి విజ్ఞాన దృష్టియే దేవుడు!

8. దైవాత్మ స్వరూపులగు మహాజనులారా! ప్రపంచములో సత్యాసక్తులగు ఉత్తమ పురుషులు మిక్కిలి కొలదియే యున్నారు. వారి శక్తివలననే ఈ ప్రపంచము నిలచియున్నది. అట్టివారు కొలదిమంది యైనను వారిశక్తి అద్భుతమైనది, అట్టి వారిశక్తి దైవశక్తిలో అంతర్భాగమే! అట్టి శక్తియే దేవుడు!

పెనములూరు శ్రీ పరమాత్మానందాశ్రమము. తను, మన, ధనములను దైవ సేవకై సర్వార్పణము చేసిన శ్రీ సాధు వెంకటేశ్వరస్వామిజీ జ్ఞాపకార్థము.

ఇట్లు భవత్ సేవాభిలాషి

భజనబాబు